

# వెన్నెల

**ఎమ్. ఉమామహేశ్వరరావు**

**"మాంగల్యం** తంతునానేన మమ జీవన హేతునా...

కంఠే బధ్నామి శుభగే త్వం జీవ శరదాం శతం..."

ప్రకృతి సిద్ధంగా సహజ భేదం గల రెండు మనసుల పవిత్ర సంగమానికి, వాటి నూరేళ్ళ పండంటి జీవనానికి మాంగల్యం ఎంత పవిత్రమైనదో వేదాలూ, ఉపనిషత్తులూ చెప్పాయి. రాగ ద్వేషాల కాలవాలమైన మనిషి జన్మలో మరిచి పోలేని, జీవితాంతం మరపురానిది ఒకే ఒక్కటి. అది జీవిత భాగస్వామిగా ఎంచుకున్న స్త్రీ మూర్తి కంఠసీమలో పవిత్రమైన మాంగల్యాన్ని మూడు ముళ్ళూ వేసి మురిసిపోవడం.

• • • •

కొబ్బరాకులతో నిండుగా, అందంగా వేసిన పందిరి కలకల్లాడుతూంది. ఆ పందిట్లో ఒక మూల స్నిగ్ధ సుకుమారియైన కన్నియ తన కాలి అందెల్ని సవరించుకుని, ఉద్వేగ భరితయై, రసపోషణ కఠినయై పరవశించి ఆడేటట్లుగా సన్నాయి వాద్యం సొంపుగా, చెవుల కింపుగా వినవస్తూంది.

మరో పక్కగా వేసి ఉంచిన తాటాకు చాపల నిండుగా కూర్చుని ఎదరగా ఉన్న వేదికపై తదేకంగా చూస్తూ నిమగ్నులై ఉన్న అనేకమంది పెద్దలూ, స్త్రీలూ కనిపిస్తున్నారు. వారి ముఖాల నిండా సంతోషపు రేఖలు వెల్లివిరుస్తున్నాయి. వారి చుట్టూ తిరుగుతూ హడావుడిగా, అన్ని రకాలుగా ప్రశ్నిస్తూ, కావలసినవి అందిస్తూ యువతీ యువకులు అల్లి బిల్లిగా అలరిస్తున్న ఆ యవ్వనమధు సౌరభాలు పందిరంతా అలుముకుంటున్నాయి.

ఆ వేదికపైన షష్టి పూర్తి ఉత్సవ సందర్భంగా పట్టు వస్త్రాలతో పక్క పక్కనే కూర్చుని, ఒకళ్ళ నొకరు వోరగంట చూసుకుంటున్న ఆ వృద్ధ దంపతుల హృదయాలు మాత్రం ఈ ఆనందోద్వేగాన్ని తట్టుకోలేక ముసిముసిగా నవ్వుకుంటు న్నాయి. సిగ్గుతో రవంత సేపు చెదిరి, మళ్ళా తల ముక్కలుగా మురిగిపోతున్నాయి.

ఆ యువతీ యువక సముదాయం మాత్రం ఏదో గొప్ప హడావుడే పడిపోతున్నారు.

ఉదయం నుంచి తీరిక లేని ఏకాగ్రతతో ఈ కార్యభారం తమ నెత్తి మీద వేసుకున్నందుకు వారి ముఖబింబాల్లో చిన్నగా అలిసిన రేఖలు మెరిసినా,

బాధ్యత గల పిల్లలుగా ఆ కార్యక్రమం యావత్తూ నడిపించుకోగలుగుతున్నందులకు మరీ తృప్తిగా ఉన్నారు.

వేదిక మీది షష్టి పూర్తి వరుడు ముసి ముసిగా చిరునవ్వులు ఒలక బోస్తుంటే, ఆ వృద్ధ వధువు మాత్రం ఏదో స్వప్నలోకాల్లో విహరిస్తున్నట్టుగా ఉండిపోయింది.

"మంగళసూత్రధారణ ముహూర్తం సమీపిస్తోంది. బాబూ, లేచి అలా ఆమె మెడలో మూడు ముళ్ళూ వేయండి" అని మంగళసూత్రాన్ని షష్టి పూర్తి వరుడికి అందిస్తూ, సన్నాయి వాళ్ళని గట్టిగా వాయించమని చేయి సైగ చేశాడు పురోహితుడు.

సన్నాయి రాగాలు తియ్య తియ్యగా కమ్మని రాగాలు పలుకుతుంటే, షష్టి పూర్తి వరుడు లేచి అలా ఆ వృద్ధ వధువు మెడలో మూడు ముళ్ళూ వేసి కూర్చున్నాడు.

అక్షింతలు ప్రోక్షించారందరూ.

ఏడడుగులు కలిసి నడిస్తే, వారు నీరవులా రంటారు. ఇద్దరూ కలిసి వేసి నడిచినవి అప్పుడు ఏడూ, ఏడూ పద్నాలు గడుగులే అయినా, శత మానం భవతి, భవతి శతాయుష్షు అన్నట్టుగా ఆయుష్షు శతమై, కలిసి కన్నుల పండువుగా కాపరం చేసుకుంటూ వుండటం వధూ వరుల లక్షణం. కలిసి నడిచినవి ఏడడుగులేనా?

గది బయట నించున్న ఆ షష్టి పూర్తి వరుని చుట్టూ యువక సమూహం. గది లోపలి వృద్ధ వధువు మీదనే వరుని మనస్సంతా.

సర్వాలంకారభూషితయై, అందంగా అలంకరించిన ఆ గది నిండా యువతులు చేయి పట్టుకుని నడిపిస్తూంటే, సిగ్గులు మొగ్గలవుతున్న ఆమె మేను పులకరించసాగింది. కట్టుకున్న పాలరంగు పట్టుచీర కాళ్ళ కడ్డం పడి మాటి మాటికీ తత్తరపాటును కలిగిస్తోంది. "ఏ నాటి అనుభూతి ఇది!"

ఆమె హృదయం తరంగంలా ఎగసిపడసాగింది. యువతుల చిర్నవ్వులు శరీరమంతా గిలిగింతలు పెడుతూ, సిగ్గులు లూటీలు చేస్తుంటే, నెమ్మదిగా కాదంబరిలా, కలహంసలా శయ్యను సమీపించింది. ఆ పానుపుపై తెల్లటి మల్లెచెండులు, కనకాంబరాలు, తలగడపై సంపెంగల పరాగాల స్వాగతాలు పలుకుతుంటే అరమోడ్పుతో కన్నులు మూసుకుంది. ఆ మూసిన కనురెప్పల చాటునుంచి ఏపాటిదో, ఎక్కడిదో చిన్న 'తడి' చారిక రవ్వంత చోటు చేసుకుని ఆమె చెక్కిళ్ళపై నుంచి ముత్యంలా జారిపోయింది.

ఆ యువతు లది గమనించలేదు. కలకలారావం చేస్తూ, కోయిలల మల్లే ఆనందంగా, అందంగా స్వరనిశ్వనాలు వదులుతూ గదిని దాటి బయట కడుగు పెట్టిన మరు నిమిషంలో బయట నున్న వరుడి పాదాలు గది లోపల కడుగిడినాయి.

గది తలుపులు బలంగా మూసుకున్నాయి.

బయటనుంచున్న యువతీ యువకుల మనస్సు లోసారి ఆనందంగా నిట్టూర్చాయి. వాళ్ళ కళ్ళలో తృప్తి వెలిగింది. తమ మనస్సులోని ఆలోచనలు ఇంత చక్కగా, ఆనందంగా జరిగిపోతాయని వూహించ లేదు. వూహించినదానికంటే ఎక్కువగా, అనుకున్న దానికంటే మరింత అందంగా జరిగిం దీ వేడుక.

వాళ్ళ ఆలోచనలన్నీ ఒక్కసారిగా పది లోజులనాటి కాలేజీ వాతావరణంలోకి జారిపోయాయి.

వాళ్ళ కళ్ళముందు టీచర్స్ వెయిటింగ్ రూము. అక్కడ ల వేళ తమ ప్రియమైన మాస్టారితో జరిపిన సంభాషణ గుర్తుకొచ్చింది ...

● ● ● ●

రాఘవరావు మాస్టారు తన క్లాసు అయిపోయాక వెయిటింగ్ రూమ్‌లోకి వెళ్ళిపోయి, చేతిలోని పుస్తకాలు అక్కడే ఉన్న టేబిలుమీద పడేసేరు నిస్సత్తువగా.

బి. ఎ. క్లాసు తెలుగు తీసుకోవడం ఎంత కష్టమో అనుభవించే వారికే తెలుస్తుంది. ముఖ్యంగా లాంగ్వేజీల్లో భావను పటిష్ఠంగా, చక్కగా, విపులంగా బోధించవలసిన అవసరం ఉంది.

క్లాసు తీసుకునేటప్పుడు ఎంతో జాగ్రత్త అవసరం. లేకపోతే విద్యార్థీ విద్యార్థినుల వేళాకోళం



చేస్తారు. మానసిక జాగ్రత్తతోపాటుగా శారీరక స్పృహ చాలా అవసరం.

కుర్చీలో కూలబడ్డాడు రవ్వంతసేపు.

"లోపలికి రావచ్చునా మాస్టారూ?!"

ఒకేసారి అయిదారుగురు విద్యార్థినీ విద్యార్థులు గుమ్మం దగ్గరే నించుని అడిగేరు.

"తప్పకుండా రండి!" కుర్చీలో సరిగా కూర్చుంటూ వారిని ఆహ్వానించారు రాఘవరావుగారు, చిర్నవ్వు ముఖంమీదకు తెచ్చుకుంటూ.

వాళ్ళంతా బిలబిలా వచ్చి ఆయన కెదురుగా బెంచీమీద కూర్చున్నారు.

"చెప్పండి!" వారినే చూస్తూ అన్నా రాయన.

"ఏం లేదు మాస్టారూ! మాకు కొన్ని సందేహా లున్నాయి. అవి మీరు తీర్చాలి. మీరు తప్పక తీరుస్తారనే ఆశతో వచ్చేం" అందులో ఓ విద్యార్థి అడిగేడు.

"ఉపాధ్యాయుడు అన్నాక విద్యార్థులకు పాఠాలు చెప్పడమేగాదు, వారి అనేక సందేహాల్ని తీర్చవలసి ఉంది. నేటి విద్యార్థులే రేపటి ఈ భావి భారత రథ సారథులు కదూ! బాధ్యత కల పౌరులుగా వార్ని తయారుచేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత అవసరం ... అడగండి. కొన్ని మాత్రమేగాదు— మీ మీ మనస్సుల్లో కదలాడే అన్ని ప్రశ్నలూ మొహమాటం పడకుండా అడగండి. నాకు తెలిసి నంతవరకూ, చేతనైనంతవరకూ చెప్పి మీ సందేహ నివృత్తి చేయడానికే ప్రయత్నిస్తాను."

గంభీరంగా అన్నారు రాఘవరావుగారు.

వాళ్ళ ముఖాలు వికసించా యా మాటలతో. ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు.

క్లాసులో అలసిపోయి వచ్చి కూడా, లేని ఓపికను తెచ్చుకుంటూ తమ సందేహాలకు సమాధానం చెబుతా నని సిద్ధపడటంతో ఆయన పట్ల అత్యంత గౌరవం, అలవిగాని సానుభూతి కలిగింది వారిలో.

ఓ విద్యార్థిని ముందు కొచ్చింది —

"మాస్టారూ! మీ రేపాఠం చెప్పినా, ఆ పాఠానికి ఓ విశిష్టత ఆపాదిస్తారు. మీ చలువవల్ల పాఠాలు ఎంతో విజ్ఞానంగా ఉంటూ ఉన్నాయి. కానీ ..."

ఆమె ఇంకా ఏం చెప్తుందోనని ఆమె వేపే చూడసాగే రాయన.

"మాస్టారూ! మీ రే పాఠం చెప్పినా అది విషాదం అయితే, మీ గొంతు విషాదం పలుకుతుంది. పాఠాన్ని చెబుతున్నంతసేపూ మీరు చెప్పే ఆ సబ్జెక్టుమీదనే మీరు మీ దృష్టిని కేంద్రీకరిస్తారు. కానీ మాస్టారూ, అసలెందుకు మీరెప్పుడూ ఏదో పోగొట్టుకున్న వారిలా ఉంటారు? అందరి మాస్టర్లలానే నవ్వుతూ ఉండరేం? మీ జీవితంలో ఏదేని విషాదం తొంగిచూసిందా? దయచేసి మాకు చెప్పండి మాస్టారూ! మీ స్వవిషయాల్లోకి వెళ్తున్నందుకు మమ్మల్ని క్షమించండి. రేపో, మాపో మీరు రిటైర్ కాబోతున్నారు. మీలాంటి వారు మాకు ముందు ముందు లభించరన్న బాధ మా అందర్నీ కలవరపెడుతోంది. చెప్పండి! మీ విషాదానికి కారణం ఏమిటో చెప్పండి! మీ విద్యార్థులుగానే కాదండీ, మీ పిల్లలుగా చనువుగా అడుగుతున్నాం ... దయచేసి మీ క్లేశాన్ని మమ్మల్ని పంచుకోనివ్వండి మాస్టారూ! ప్లీజ్! ..."

వారిని ఆకర్ణాంతం లాగి అభిమాన శరాల్ని హృదయం మీదకు సూటిగా సంధించి వదిలిన వారిని చూసి రాఘవరావుగారి కనుల వెంబడి నీరు జలజలా రాలింది. హృదయం లోతుల్ని తడిమి చూస్తున్న వారి అభిమానం, అనురాగం వరద తనను ముంచివేస్తున్న అనుభూతితో ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

ఆర్ద్రమైన చెక్కిళ్ళ మీదకు జారిపోతున్న కన్నీటిని అపుకుంటూ వారి వేపు చూశా రాయన. మసకబారిన ఆయన కళ్ళ ముందు నించున్న వాళ్ళంతా ఎంతో ఉన్నతులుగా కనిపించారు.

కన్న సంతానం గుర్తు కొచ్చింది వెంటనే— చలించి పోయారు ఒకింతసేపు.

"చెబుతానమ్మా! తప్పక చెబుతాను. నా పిల్లల కంటే ఎక్కువ చనువుగా, ఆప్యాయతతో అడుగుతున్న మీ అందరికీ తప్పక చెబుతాను. కానీ, నేను చెప్పేది నా వ్యక్తిగతం— పైగా ఏ ఒక్కరి జీవితంపైనా నీలినీడల్ని ప్రసరించకూడదు."

దుఃఖోద్వేగం ముంచు కొస్తుంటే కనులు మూసుకున్నా రాయన.


## స్మృత్యంజలి



అమరజ్యోతి

**యం. వెంకటసుబ్బమ్మ**

కెరటాలు ఎంత ఎగసినా సముద్రాన్ని విడిపోవు
వెన్నెలలు ఎంత విరిసినా చంద్రుణ్ణి వదలిపోవు
కలసిన ఆత్మల అనుబంధాలు ఏ జన్మకూ విడిపోవు
నీ తనువు మానుంచి దూరమైనా, నీ అనుబంధం
విడిపోదు

నీ పవిత్ర ఆత్మకు శాంతి కలుగుగాక !

నీ భర్త
**డా॥ యం. రాధాకృష్ణ**
కర్నూలు వీధి, తిరుపతి

నీ తీపి గుర్తులు :
విజయకుమార్
అజయ్‌కుమార్
నందకుమార్

కుమార్తె: శ్రీమతి శైలజ
భర్త: డి. సుబ్రహ్మణ్యం
మనుమడు: దినేష్

ESTD: 1978 PHONE: 512

## SRI VENKATESWARA TECHNICAL AGRICULTURE TRAINING COLLEGE

POST BOX NO: 30,
CHILAKALURIPET-522 616, Guntur (Dt.)

### S.S.C., INTER విద్యార్థులారా!

S.S.C., Inter పరీక్షలు అక్టోబరులో వ్రాసి ఖాళీగా ఉన్న విద్యార్థులకు మరియు 7 నుండి డిగ్రీ వరకు ఏ ఒక్కటి పూర్తి చేసిన వారికైనను ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యాశాఖ వారు నిర్వహించు అగ్రికల్చర్ కోర్సునందు ఉచిత శిక్షణ ఇవ్వబడుచున్నది. 55 సంవత్సరములు రిటైర్‌మెంట్ తగ్గించినందువలన ఈ శిక్షణ పాసైన వారికి వెంటనే ఎన్నో ప్రభుత్వ ఉద్యోగ అవకాశములు కలవు. స్త్రీలు కూడ ఈ శిక్షణకు అర్హులే. శిక్షణలో చేరిన వారికి పాటములు అన్నియు ఉచితంగా పోస్టులో పంపబడును. పూర్తి వివరములకు అప్లికేషన్ ఫారమునకు 10 రోజుల లోగా పై మా అడ్రసుకు రు. 4/— లు M.O ద్వారా పంపి పొందవచ్చును.

PRINCIPAL

"ఇక్కడకు పోస్టింగ్ అయ్యే ముందు యలమంచిలిలో తెలుగు పండితుడుగా ఉండేవాణ్ణి. నా పిల్లలు మధు, భాస్కరాలు— ఇద్దరూ కాలేజీ చదువులు పూర్తి చేస్తున్న సమయం. ఒక్కగానొక్క కూతురు శారదను హైస్కూలు చదువుతో ఆపేశాను.

శారదకు చాలా సంబంధాలు వెతికాను వరుడి కోసం. కానీ, ఏ ఒక్కటీ కుదరలేదు. కొందరు అధిక కట్నాల వలయంలో మమ్మల్ని బిగించాలని చూస్తే, మరి కొందరు కుర్రాళ్ళు ఫారిన్ చదువు కోసం తాళిదు లిచ్చారు. బతకలేక బడిపంతులని అని అంటారు కదా! నా ఆలోచనలకీ, అభిప్రాయాలకీ అర్థం పట్టేది నా కూతురు శారద. కట్నకానుకలు, ఫారిన్ చదువులు డిమాండ్ చేసిన ఏ ఒక్కడూ మామూలుగా తిరిగి వెళ్ళకుండా ముఖం వాచేట్లు చీవాట్లు పెట్టి మరీ పంపించేది. అలా ఎంత కాలం!

సరిగ్గా ఈ సమయంలోనే చదువు పూర్తి చేసి ఏదో ఉద్యోగం కోసం అప్లయి చేసిన మధుకు హైదరాబాదులో ఇంటర్వ్యూ వచ్చింది. ఇంటర్వ్యూ పాటీ ఎంతో సంబర పడ్డాం. ఆ రోజే నా భార్య చేతికి మిగిలిన ఒకే ఒక్క బంగారు గాజు మార్వాడీ షాపులోకి వడిచింది.

ఎలాగైతేనేం, హైదరాబాదులో వాడికి ఉద్యోగం అయింది. అయినట్లు వాడే ఒక ఉత్తరం రాశాడు.

'నాన్నగారూ! తమ్ముడికి ఉద్యోగం, చెల్లాయి పెళ్ళి జరిపించే బాధ్యత నాది. మీరేం దిగులు పడకండి' అని రాశాడు.

పాపం! వాడి తల్లి ఎంత సంబర పడిందో ఆ భగవంతుడికే తెలుసు. అక్కడ ఉద్యోగంలో జాయినైనాక కొన్ని నెలలు వరసగా డబ్బు పంపాడు. కానీ రాను రాను అదీ ఆగిపోయింది. ఉత్తరాలు రాయడం, ఒక వేళ రాస్తే ఏవేవో నాలుగు మాటలు ముక్తసరిగా రాసేవాడు. చివరకలాగే చేజారి పోయాడు. రెండో వాడు ఉద్యోగం దొరక్క ఈ సమాజంపై తీవ్రమైన అసంతృప్తిని పెంచుకుని మాకు అందనంత రీతిలో తిరగ సాగేడు.

శారదకు ఒక సంబంధం వచ్చింది. కుర్రాడు విశాఖలో ఏదో ప్రభుత్వ సంస్థలో మంచి ఉద్యోగం చేస్తున్నాడు. కులమూ గోత్రమూ, రూపు రేఖలూ మా కెంతో సంతృప్తిని కలిగించాయి. కానీ ఆ అబ్బాయి పెట్టిన ఒకే ఒక్క షరతు విని హతాశులైనాం.

'మాస్టారూ! మీ అమ్మాయిని వివాహం చేసుకుందుకు నాకు మనఃస్ఫూర్తిగా అంగీకారం ఉంది. మీ వంటి వారికి అల్లుడయ్యేందుకు ఉవ్విళ్ళూరుతున్నాను. కానీ ఒక చిన్న షరతు. నాకూ ఒకే ఒక్క చెల్లాయుంది. అదీ పెళ్ళీడు కొచ్చింది. ఆ పెళ్ళి జరిపించాల్సిన బాధ్యత నా మీదనే ఉంది. మీ రన్యథా భావించద్దు. మీ ఇద్దరి మగపిల్లల్లో ఎవరైనా సరే, మా చెల్లెల్ని వివాహం చేసుకుందుకు అంగీకరిస్తే మీ అమ్మాయితో పెళ్ళికి నేనూ సిద్ధంగా ఉన్నాను.'

ఎంత ఉన్నతమైన అభిప్రాయం అది! ఒక్కుర్రాడికి తన వివాహం కన్నా, తన తోడబుట్టిన




చెల్లి వివాహం ఎంత ముఖ్యమో అతని మాటల ద్వారా గ్రహించాము. అయినా వెంటనే ఏం చెప్పగలను? పిల్లలతో మాట్లాడి కబురు చేస్తానని చెప్పి పంపేశాను." ఒక్క నిమిషం ఆగిపోయారు రాఘవరావుగారు.

తిరిగి చెప్పసాగారు. "పెద్దవాడి సంగతి అలానే ఉంచి, ముందు చిన్నబ్బాయి భాస్కరాన్ని కదిపాము.

'నాన్నగారూ! ఉద్యోగం సద్యోగం లేకుండా గాలికి తిరుగుతున్న నాకు ఇప్పుడే పెళ్ళి చేస్తామంటున్నారు. వచ్చే ఆ అమ్మాయి మన ఇంట పస్తులతో పడి చావాలనా? చెల్లి మీద జాలిపడి తొందరపడితే ఆనక అందరం కలిసి కట్టుగా ఏ నూతిలోనో దూకి చావాలి' అన్నాడు వాడు. మాట్లాడలేకపోయాను. పోనీ పెద్దవాడిని కదుపుదాం అని ఒక ఉత్తరం వ్రాశాను విషయమంతా వివరిస్తూ. ఒక పది రోజులకు మధు నుంచి సమాధానం వచ్చింది.

ఏవేవో కారణాల వల్ల అప్పటికే ఒక ముస్లిమ్ పిల్లను పెళ్ళి చేసుకున్నానని, క్షమించమని, చెల్లి పెళ్ళి తను దగ్గరుండి బ్రహ్మాండంగా జరిపిస్తానని వ్రాశాడు.

కారణాలు ఏమైనా కన్నపిల్లలు ఇద్దరూ మా అదుపు ఆజ్ఞల్ని ఏ నాడో దాటిపోయారని చాలా ఆలస్యంగా తెలుసుకోగలిగాం.

కన్నతండ్రిగా, బాధ్యత గల ఉపాధ్యాయుడిగా వాళ్ళను నేను అర్థం చేసుకున్నా, వాళ్ళ తల్లి మాత్రం హర్షించలేకపోయింది.

ఈ సమాజం మమ్మల్ని చిన్న చూపు చూడ నారంభించింది. మా కుటుంబ గౌరవాన్ని, ప్రతిష్ఠను మంట గలుపుతూ చిన్నబ్బాయి భాస్కరం ఎవరో విధవను అనాథ శరణాలయం నుంచి తెచ్చి పెళ్ళి చేసుకున్నాడు.

ఇక మేం శారదకు ఏ రకం పెళ్ళి జరిపించాలి?

ఒకడు కులాంతర వివాహం జరుపుకున్నాక, మరొకడు ఆదర్శ వివాహం జరుపుకున్నాక, శారదకే రకం పెళ్ళి జరిపించాలన్నది మాకు ప్రతి క్షణం ఒక పెద్ద సమస్యగా తయారైంది.

సమాజం వెక్కిరించింది. దూషించింది. శారదకు పెళ్ళి సంబంధాలు రాకుండా చేయడంలో ఈ సమాజం కృతకృత్యురాలైంది. చివరకు తన అన్నయ్యలు చేసిన నిర్వాకాల వల్ల కుటుంబం ఎలాటి



పరిస్థితుల పాలైందీ గ్రహించి నా కూతురు శారద నిద్ర మాత్రలు మింగి ఈ లోకం నుంచే శాశ్వతంగా నిష్క్రమించింది."

ఆయన గుండెని పిండుతూ బాధ రగిలింది. కన్నీళ్ళు రాలుతూ నేలమీద చిందాయి. ఇక చెప్పలేక ఆగిపోయా రాయన.

మాస్టారి ఆవేదన ఆ లేత మనసుల హృదయాల్లో చెరగని ముద్రవే సేసింది. బాధను రగిలించింది. తడిసిన కళ్ళతో అలా ఎంతో సేపు మాస్టారివేపు చూస్తూండి పోయారు.

"మాస్టారూ! ఇంత బడబానలాన్ని మోస్తూ బతుకు దీస్తున్న మీరు మహా సాగరంలా గంభీరంగా, నిశ్చలంగా ఇంత కాలం ఎలా ఉన్నారోనని ఆశ్చర్య పోతున్నాం. మేమంతా మీ పిల్లలం ఈ క్షణం నుంచి. మీ దిగులూ, మీ దుఃఖం మాన్పడానికి శాయ శక్తులా కృషి చేస్తాం. మమ్మల్ని కాదనవద్దు. మీరు రిటైరైనాక ఎక్కడికీ వెళ్ళవద్దు. ఇక్కడే— ఈ వూళ్ళోనే ఉండిపోండి. మాకు మీ ఆశీర్వాదాలు కావాలి. మా అందరి జీవితాలు మీ దీవెనలతో హాయిగా గడిచి పోవాలి. మరో చిన్నకోరిక, మాస్టారూ! మరో పది రోజుల్లో మీరు రిటైరై పోతున్నారు. ఆ రోజు మేమంతా వేడుకగా పార్వతీ పరమేశ్వరుల్లాంటి మీ దంపతులకు షష్టి పూర్తి పండగ కళ్యాణప్రదంగా జరిపిస్తాం. కాదనకండి, మాస్టారూ!"

వాళ్ళ గొంతులు ఎంతో ఉద్వేగంతో, ఆవేశంతో పలికాయి. ఆ మనసులు పడే ఆనందం, వాళ్ళు కోరే కోరిక రాఘవరావుగారిని నోరెత్తి మరో మాట పలకనీయలేదు.

మనసంతా నిండిన తృప్తితో, సంతోషంతో పొలకరి జల్లులా కలకిలాడుతున్న వారందర్నీ ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటూ ఆనంద బాష్పాలు రాల్చారు రాఘవరావుగారు.

కడుపున పుట్టిన పిల్లలు ఎంతో ఆనందంగా జరిపించవలసిన ఈ షష్టి పూర్తి ఈ రోజున పరాయి పిల్లలచే జరపబడుతున్నందుకు రాఘవరావుగారి సతీమణికి మనస్సులో ఏదో మూల చిన్నగా రవ్వంత అసంతృప్తినే కలిగించింది.

భర్త పాదాల వద్ద చేరుతూ వినయంగా ఆ మాటే అంది.

భార్య మాటలకు రాఘవరావుగారి మనస్సు అదోలా అయింది.

"పిచ్చిదానా! బాధ పడకు. దగ్గర లేని కన్నవాళ్ళ కోసం దుఃఖపడి ఏం ప్రయోజనం? వాళ్ళు రెక్కలొచ్చిన పక్షుల్లా ఎవరి దారి వాళ్ళు ఎంచుకుని దూరమై పోయారు. ఈ బతుకు పోరులో ఇద్దరమే మిగిలాం. ఏ నాడైతే వాళ్ళు మనల్ని కాదని వెళ్ళారో, కన్నవాళ్ళుగా కాక పరాయి వాళ్ళయారు. వీళ్ళంతా పరాయి వాళ్ళయినా, కన్నవాళ్ళని మరిపించారు. చిన్న పిల్లలైనా వెన్నెల లాటి మనస్సులతో మనకీ వెన్నెల చూపించారు. ఈ అభిమాన వెల్లువలో ఏ అనుబంధం లక్ష్యరకొస్తుంది!"

రాఘవరావుగారు అసంకల్పితంగా రెండు చేతుల్నీ ఎత్తి ఆ గది బయట ఉన్న యువతీ యువకులకు మనసారా నమస్కారం చేశారు. *